నమస్తే తెలంగాణ

# పెద్దపల్లి

5 | కరీంనగర్, శనివారం 11 జనవరి 2025 | PEDDAPALLI



గుండారం రిజర్వాయర్‌ను సందర్శించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

## నీటి విధానంపై మంత్రి స్పష్టత ఇవ్వాలి

- ఎంత ఆయకట్టు.. ఎంత మేర నీళ్లు ఇస్తారో చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

కమాన్‌పూర్, జనవరి 10 : పంటలకు సాగునీరందించే విధానంపై మంథని ఎమ్మెల్యే స్పష్టత ఇవ్వాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కమాన్‌పూర్ మండలం గుండా రం రిజర్వాయర్‌ను రైతులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం ఎనిమిది పీట్ల మేర మాత్రమే నీళ్లున్నాయని, 12 పీట్లు ఉంటేనే కింది ప్రాంతాలకు నీళ్లు విడుదల చేసే అవకాశముంటుందని చెప్పారు. అయితే జనవరి పదో తేదీ వ చ్చినా ఇప్పటివరకు శ్రీరాంసాగర్ నీళ్లు రాలేదని, అసలు నీళ్లు వస్తాయా.. రావా..? అనే మీమాంసలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. గతేడాది సైతం నీళ్లు వస్తాయనే నమ్మకంతో పంటలు సాగు చేశారని, తీరా నీళ్లు లేక పంటలన్నీ ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన చెందారు. సాగునీటి విషయంలో ఇప్పటివరకు మంత్రి ఏమి మాట్లాడడం లేదని, కనీసం కలెక్టర్ ద్వా రానైనా ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం ఎస్సారెస్పీ ఈ ఈ సాగునీటి విషయమై మీటింగ్ పెట్టినట్టు పత్రికలో చూశానని, కానీ ఏలాంటి స్పందన లేదన్నారు. ఈఈని కలిస్తే రేపటి సాయంత్రం వరకు నీళ్లు వస్తాయని చెప్పారని తెలిపారు. పదేళ్ల కాలంలో తమ ప్రభుత్వం శ్రీరాంసాగర్, ఎస్సారెస్పీ ద్వారా గుండారం రిజర్వాయర్‌లోకి నీటిని తరలించి, రెండు పంటలు సాగు చేసుకునేలా నీరందించామని గుర్తు చేశారు. కానీ, ప్రస్తుత మంత్రి మాత్రం సాగునీటి విషయంలో మాట్లాడడం లేదని, మా మాటలు పట్టించుకోవడం లేదన్నారు. ఆనాడు తాము అధికారంలో ఉన్నప్పుడు పనులు చేసి ప్రజలకు దగ్గరయ్యాయని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సాగునీటి విషయంపై వెంటనే స్పష్టత ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ శంకర్, మండల యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్ గౌడ్, మాజీ జడ్పీటీసీ మేకల సంపత్, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, రామగిరి పార్టీ మండలాధ్యక్షుడు శంకేసి రవీందర్, నాయకులు సాయికుమార్, సతీశ్, రాచకొండ చంద్రమౌళి, ఆకుల గట్టయ్య, రాచకొండ రవి, కొండ వెంకటేష్, ఆకుల కిరణ్, తోడేటి రాజీర్, బొల్లపల్లి శంకర్ గౌడ్, సింగం శ్రీనివాస్, తోట రాజ్‌కుమార్, దండె రమేశ్, పంతకాని రవి, ఆకుల తిరుపతి, పిడుగు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్ బస్‌స్టేషన్‌లో స్పెషల్ బస్సుల వద్ద ప్రయాణికులు





కరీంనగర్ బస్‌స్టేషన్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

# ఆర్టీసీ అదనపు బాదుడు!

- సంక్రాంతి పండుగ వేళ చార్జీల మోత
- స్పెషల్ ట్రిప్పుల పేరిట చార్జీలు పెంపు
- ఒక్కో టికెట్‌పై దాదాపు 50శాతం వరకు పెరుగుదల
- అయినా ప్రత్యేక బస్సుల్లో దొరకని సీట్లు
- ప్రయాణించాలంటే నిలబడి వెళ్లాల్సిందే
- బెంబేలెత్తుతున్న ప్రయాణికులు
- స్పెషల్ కాదు.. రెగ్యులర్ సర్వీసులు నడపాలనే డిమాండ్

**సంక్రాంతి పండుగ వేళ ఆర్టీసీ అదనపు చార్జీలతో బాదుతున్నది. స్పెషల్ బస్సుల పేరిట దాదాపు 50 శాతం వరకు టికెట్ల రేట్లు పెంచి దండుకుంటున్నది. మూడు రకాల సర్వీసుల ద్వారా అందుతున్న సేవలపై ₹110 నుంచి ₹170 వరకు ఎక్స్‌ట్రా వసూలు చేస్తున్నది. ప్రధానంగా హైదరాబాద్ నుంచి కరీంనగర్, ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులపై భారం మోపుతున్నది. పండగకు ఇంటికి వెళ్లాలన్నా.. ఇంటి నుంచి తిరిగి వెళ్లాలన్నా మోత మోగుతుండగా, పురుష ప్రయాణికులపై ప్రభావం పడుతున్నది. ఓవైపు మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తూనే.. ఈ రకంగా చార్జీలు పెంచడం విమర్శలకు తావిస్తున్నది. అయినా రద్దీకి తగినట్టు సర్వీసులు లేక ప్రత్యేక బస్సుల్లో కూడా నిలబడే ప్రయాణించాల్సి వస్తున్నది. అదనపు చార్జీలు చెల్లిస్తున్నా కనీసం సీట్లు దొరక్కపోవడంతో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. స్పెషల్ బస్సులు కాదు.. రెగ్యులర్ బస్సులు నడపాలన్న డిమాండ్ వ్యక్తమవుతున్నది.**





కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు

కరీంనగర్, జనవరి 10 (నమస్తే తెలంగాణ)/ తెలంగాణ చౌక్ : పండుగ పూట ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నది. అందులో ప్రత్యేకత కూడా ఏమీ లేదు. కానీ, బస్సుల్లో కనీసం సీటు కూడా దొరకని పరిస్థితి ఉన్నది. అయినా ఆర్టీసీ యాజమాన్యం మాత్రం ఈ నెల 7 నుంచి అదనపు చార్జీలతో ప్రయాణికుల జేబులకు చిల్లులు పెడుతున్నది. ఇప్పటికే లక్షలాది మందిపై అదనపు చార్జీల భారం వేసింది. పండుగకు ముందే కాదు, తర్వాత కూడా ఇవే చార్జీలు వసూలు చేయాలని ఆర్టీసీ ప్రణాళికలు వేసినట్టు కనిపిస్తున్నది. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ రావాలంటే ఎక్స్‌ప్రెస్ సర్వీసులో సాధారణ టికెట్ ధర ₹230 మాత్రమే ఉండగా, ఇప్పుడు ₹340 వసూలు చేస్తున్నారు. అదనంగా ₹110 తీసుకుంటున్నారు. సూపర్ లగ్జరీలో సాధారణ సమయంలో ₹310 ఉంటే ఇప్పుడు ₹440 వసూలు చేస్తున్నారు. అంటే ₹130 అదనంగా బాదుతున్నారు. ఇక రాజధాని బస్సులో ₹390 ఉంటే.. ఇప్పుడు ₹560 వసూలు చేస్తున్నారు. అంటే ₹170 అదనంగా వసూలు చేస్తున్నారు. ఇక గోదావరిఖని నుంచి కరీంనగర్ రావాలన్నా, ఇక్కడి నుంచి గోదావరిఖని వెళ్లాలన్నా ప్రతి సర్వీసులో ₹40 అదనంగా వసూలు చేస్తున్నారు.

### తిరుగు ప్రయాణంలోనూ అంతే

ఈ నెల 14న సంక్రాంతి ఉన్నది. ఈ నేపథ్యంలో పండుగకు ముందు అంటే.. ఈ నెల 7 నుంచే హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు ఎక్కువ మంది ప్రయాణికులు వస్తున్నారు. ఇది 13 వరకు కొనసాగుతుంది. ఇటు నుంచి అటు వెళ్లే ప్రయాణికులు కూడా పెద్ద సంఖ్యలో ఉంటారు. వీరి కోసం ప్రత్యేక బస్సులు నడిపిస్తున్న ఆర్టీసీ.. ఒక్కో టికెట్‌పై అదనంగా బాదుతున్నది. అయితే తిరుగు ప్రయాణంలో కూడా ఇవే అదనపు చార్జీలను వసూలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలుస్తున్నది. పండుగ తర్వాత అంటే.. ఈ నెల 16 నుంచి 22 వరకు తిరిగి వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులను నడుపుతూ ఇప్పటి మాదిరిగానే చార్జీలు వసూలు చేయబోతున్నది. పండగకు ముందు 770 ట్రిప్పులు, పండగ తర్వాత 970 ట్రిప్పులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించినట్టు తెలుస్తున్నది. సాధారణ సమయాల్లో అయితే కరీంనగర్ నుంచి 80 వేల మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తారు. అందులో ఎక్కువగా హైదరాబాద్, కరీంనగర్ మధ్యన ప్రయాణించే వాళ్లే ఎక్కువగా ఉంటారు. ఇప్పుడు ఆ సంఖ్య లక్షకు చేరింది. పండుగ దగ్గర పడిన కొద్దీ ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంటుంది.

### ప్రత్యేక బస్సులైనా నిలబడాల్సిందే

ప్రత్యేక బస్సుల పేరిట కరీంనగర్, హైదరాబాద్ మధ్య, గోదావరిఖని, కరీంనగర్ మధ్య నడుపుతున్న సర్వీసుల్లో ప్రత్యేకత ఏమీ కనిపించడం లేదు. నిజానికి ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు వసూలు చేసినప్పుడు కనీసం సీట్ల వరకైనా టికెట్లు ఇస్తే బాగుండేది. కానీ, ప్రతి స్పెషల్ బస్సులో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తుండగా, చివరికి మహిళా ప్రయాణికులు కూడా నిలబడే ప్రయాణించాల్సి వస్తున్నది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినా.. ఇప్పుడు మాత్రం బస్సుల సంఖ్యను పెంచ లేదు. బస్సుల్లో 80 శాతం మంది మహిళలే ప్రయాణిస్తుండగా, ఇబ్బందిగా వెళ్లాల్సి వస్తున్నది. అదనపు చార్జీలు బాదినా కనీసం సుఖంగా ప్రయాణించే పరిస్థితి లేక పోవడంతో ప్రయాణికులు ఆగ్రహిస్తున్నారు. అదనపు చార్జీలు వసూలు చేసినప్పుడు తమకు కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత కూడా ఆర్టీసీదేనని స్పష్టం చేస్తున్నారు.

### ఇదీ ప్రత్యేక బస్సుల ప్రణాళిక

పండుగకు ప్రత్యేక బస్సుల పేరిట ఆర్టీసీ యాజమాన్యం ఒక ప్రణాళికను రూపొందించింది. ఇది ఈ నెల 7 నుంచి 13 వరకు మొదటి దఫా అమలవుతున్నది. ఈ దఫాలో 770 ట్రిప్పులు నడపాలని నిర్ణయించుకున్నది. అందులో భాగంగా ఈ నెల 7న 35,8న 35, 9న 40 బస్సులు నడిపిన ఆర్టీసీ 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రతి రోజూ 165 ట్రిప్పులు నడిపేందుకు నిర్ణయించింది. అంతే కాకుండా, పండుగ తర్వాత అంటే.. ఈనెల 16 నుంచి రెండో దఫాలో 970 ట్రిప్పులు నడిపించేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా 16న 180, 17న 145, 18న 145, 19న 190, 20న 150, 21న 80, 22న మరో 80 ట్రిప్పులు ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించుకున్నది. అయితే ఒక్కో బస్సు కెపాసిటీ 50 సీట్లుగా లెక్కిస్తారు. పండగ పూట తప్పని పరిస్థితుల్లో అంతకంటే ఎక్కవ మందే ప్రయాణం చేస్తుంటారు. 50 సీట్లు వేసుకున్నా మొదటి దఫాలో 38,500 మందిని, తిరుగు ప్రయాణంలో 48,500 మందిని ప్రత్యేక బస్సుల్లో తమ గమ్య స్థానాలకు చేర్చాలని నిర్ణయించింది. రెండూ కలిపితే 87 వేల మంది ప్రయాణికులు ఈ ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించే అవకాశం కనిపిస్తున్నది. అంటే అదనపు చార్జీల మోత ఎంత భారమవుతుందో దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు.

### రెగ్యులర్ బస్సులు నడపాలి



ఫ్రీ బస్సులతోని ప్రయాణం కష్టంగా మారింది. పండగ సందర్భంగా రేట్లు పెంచడం సామాన్యులకు భారమే. సరిపడా బస్సులు లేక నిల్చొని ప్రయాణిస్తున్నాం. ఇప్పుడు గంట నుంచి బస్సుల కోసం ఎదురు చూస్తున్నా. పండుగ రోజుల్లో అదనపు బస్సులు వేయకపోవడం ఆర్టీసీ వైఫల్యమే. ప్రత్యేక బస్సుల కన్నా రెగ్యులర్ బస్సులు నడపా లి. చార్జీలు పెంచడం కరెక్ట్ కాదు. ప్రయాణికులపై అదనపు భారం పడుతుంది.

**- గణేశ్, స్టూడెంట్ (గోదావరిఖని)**

### కూసుందామంటే సీట్లే లేవు

కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో నా కొడుకు ఇంటర్ చదువుతున్నడు. వాడిని తీసుకెళ్లడానికి ఆసిఫాబాద్ నుంచి వచ్చేటప్పుడు నిలబడే వచ్చిన. బస్టాండ్‌లో బస్సు కోసం గంట నుంచి వెయిట్ చేస్తున్న. కరీంనగర్ నుంచి గోదావరిఖనికి వెళ్లి అక్కడి



నుంచి మా ఊరికి వెళ్తామని స్పెషల్ బస్సు ఎక్కిన. ఇంతకముందు ఇందులో ₹110 చార్జి ఉంటే ఇప్పుడు ₹150 తీసుకుంటున్నరు. ఈ బస్సు తప్పా మాకు వేరే బస్సులు అందుబాటులో లేవు. ప్రత్యేక బస్సులు అంటే కనీసం సీట్లయినా ఉండాలి కదా! కూసుందామంటే సీట్లే లేవు. గోదావరిఖని వరకు నిలబడే పోవాలి. ప్రత్యేక బస్సుల కంటే రెగ్యులర్ బస్సులు నడపాలి. ప్రయాణికులపై అదనపు చార్జీలు వేయకుండా చూడాల్సిన బాధ్యత ఆర్టీసీ యాజమాన్యానిదే.

**- జలపతి రావు, ప్రయాణికుడు (ఆసిఫాబాద్)**

### అదనపు చార్జీలతో భారం

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు ప్రకటించి అందులో ఒక్క ఉచిత ప్రయాణం మాత్రమే అమలు చేసింది. కానీ, సరిపడా



బస్సులు లేక నిత్యం ప్రయాణికుల మధ్య కొట్లాటలు జరుగుతున్నాయి. ఉచిత ప్రయాణాన్ని విద్యార్థులు, పేదలకు మాత్రమే వర్తింపజేస్తే బాగుండేది. ప్రభుత్వ వేతనాలు పొందుతున్న ఉద్యోగులు కూడా ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకుంటున్నారు. ప్రభుత్వం ఆలోచించాలి. ఇలా పండుగరోజుల్లో అదనపు చార్జీల పేరిట భారం వేయద్దు.

**- ఆకుల స్వామి వివేక్ పటేల్, ప్రయాణికుడు (పెద్దపల్లి)**

### ఉచిత ప్రయాణంతో ఇబ్బందులు

పండగకు మా అమ్మ వాళ్ల ఇంటికి వరంగల్ వెళ్లేందుకు మా అమ్మ, నా కొడుకుతో బస్టాండ్‌కు వచ్చిన. ఇక్కడ చూస్తే బస్టాండ్ మొత్తం కిక్కిరిసిపోయింది. ఏ బస్సు కూడా ఎక్కేందుకు వీలు లేకుండా ఉన్నది.



గంటన్నర నుంచి ఎదురుచూస్తున్నాం. ఉచిత ప్రయాణం పథకం పెట్టినప్పుడు ప్రభుత్వం అందుకు సరిపడా బస్సులు పెంచాల్సింది. అసలు ఉచిత ప్రయాణం కంటే ఉపాధి కల్పించే పథకాన్ని ప్రవేశ పెట్టాల్సింది. పండుగ సందర్భాల్లో ప్రయాణించే మాలాంటి వారికి సీట్లు దొరకకా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఉచిత ప్రయాణంపై పునరాలోచించాలి.

**- సాహితి, ప్రయాణికురాలు (కరీంనగర్)**

## కేసీఆర్‌ను కలిసిన సిరిసిల్ల నేతలు



తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌తో సిరిసిల్ల నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 10: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం సిరిసిల్లకు చెందిన పలువురు నాయకులు ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు సిరిసిల్ల బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ అర్బన్ బ్యాంకు వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, దార్ల సందీప్, అన్నారం శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## తెరపైకి కొత్త మండలాల లొల్లి!

- పెద్దపల్లి జిల్లాలో మూడు మండలాలు, 11 జీపీల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- కొత్తగా మరో నాలుగు మండలాల ఏర్పాటుకు డిమాండ్లు
- కొత్తవి ఏర్పాటు సాధ్యమయ్యేనా? అనే అనుమానాలు




రాగినేడు కేంద్రంగా పెద్దపల్లి రూరల్ మండలం ఏర్పాటు చేయాలని ఆందోళన చేస్తున్న నాయకులు


పెద్దపల్లి, జనవరి 10 (నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లాలో కొత్త మండలాల లొల్లి తెరపైకి వస్తున్నది. ఇటీవల ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం కోరిన నేపథ్యంలో కొత్త మండలాల ఏర్పాటుకు డిమాండ్ పెరుగుతున్నది. జిల్లాలో ఇప్పటి వరకు 13 రూరల్ మండలాలు, ఒక అర్బన్ మండలం ఉండగా, 269 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే కొత్తగా మంథని మండలం గుంజపడుగు, సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి, పెద్దపల్లి మండలం రాఘవాపూర్ మండలాలతోపాటు 11 గ్రామ పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి. వీటికి గ్రీన్ సిగ్నల్ వచ్చే అవకాశముండగా, కొత్తగా మరో నాలుగు మండలాల కోసం విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. రాగినేడు, కొలనూర్, దొంగతుర్తితోపాటు రామగుండం నియోజకవర్గం నుంచి జనగామ అర్బన్ మండలాలను ఏర్పాటు చేయాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. ఇది జిల్లా యంత్రాంగానికి కాదు, ఎమ్మెల్యేలకు కూడా తలనొప్పిగా మారినట్టు తెలుస్తున్నది. గత వారం జరిగిన కేబినెట్ మీటింగ్‌లో కొత్త మండలాలతోపాటు గుంజపడుగు మండల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వస్తుందని అందరూ భావించగా.. కొత్త డిమాండ్లు తెరపైకి రావడంతో వాటిని కాస్త పక్కకు పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇటు ఎక్కడికక్కడ కొత్త మండలాల కోసం నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చేస్తున్నారు. అధికారులు, నాయకులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. గత సోమవారం రాగినేడును పెద్దపల్లి రూరల్ మండలం ఏర్పాటు చేయాలని కోరుతూ అఖిలపక్షం నాయకులు పెద్దపల్లి కలెక్టరేట్ వచ్చి ప్రజావాణిలో అర్జీ ఇచ్చారు. తాజాగా, దొంగతుర్తిని కొత్త మండలంగా చేయాలని నాయకులు ధర్మారంలో విలేకరుల సమావేశం పెట్టి కోరారు. గతంలో తాము కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించామని గుర్తు చేశారు.


## మూడు ప్రమాదాలు.. ఆరుగురు దుర్మరణం

- జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఘటనలు
- ఒక చోట ముగ్గురు, మరో చోట ఇద్దరు, ఇంకో చోట ఒకరు మృతి

**జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో శుక్రవారం జరిగిన మూడు వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృత్యు ఒడికి చేరారు. చిన్నమ్మ ఇంటికెళ్లొస్తూ ఇద్దరు.. ఒగ్గు కథ చెప్పేందుకు వెళ్లి ఒకరు.. పుట్టిన రోజు అమ్మమ్మ ఇంటికెళ్లొస్తూ ఇంకొకరు.. అతనివెంటే ఉన్న సోదరుడు.. బస్సు కోసం వేచి చూస్తూ ఓ మహిళ ప్రాణాలు కోల్పోయారు. అనుకోని మరణాలతో ఆయా కుటుంబాల్లో పండుగపూట విషాదం నెలకొన్నది.**







సాయి (ఫైల్), అరవింద్ (ఫైల్), వంశీ (ఫైల్)

జగిత్యాల రూరల్/పెద్దపల్లి రూరల్, సుల్తానాబాద్, జనవరి 10 : జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌కు చెందిన బత్తుల జలపతి-విజయ దంపతుల కుమారుడు సాయి(20), బూతగడ్డ ప్రభాకర్-జమున కొడుకు అరవింద్(20) స్నేహితులు. వీరిద్దరు అరుణాచల్, తిరుమల పుణ్యక్షేత్రాలకు వెళ్లి రెండు రోజుల క్రితం స్వగ్రామానికి చేరుకున్నారు. సోమన్‌పెల్లిలో ఉండే తన చిన్నమ్మకు శుక్రవారం ప్రసాదం అందించి తిరిగి తన స్నేహితుడు అరవింద్‌తో కలిసి సాయి బైక్‌పై వస్తున్నాడు. తక్కళ్లపెల్లి శివారులో జగిత్యాల నుంచి ధర్మపురి వైపు వెళ్తున్న మేడిపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన వంశీ(25) బైక్ ఎదురెదురుగా ఢీకొని, అరవింద్, వంశీ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన సాయిని స్థానికులు జగిత్యాల జిల్లా దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఒగ్గు కథ కళాకారుడైన దయ్యాల వంశీ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. తక్కళ్లపెల్లిలో ఓ ఇంట్లో ఒగ్గు కథ చెప్పేందుకు వెళ్తున్న వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదం జరిగి ముగ్గురు యువకులు చనిపోవడంతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొన్నది. ప్రమాద స్థలాన్ని ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ రఘుచందర్ పరిశీలించారు. జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ సదాకర్ యువకుల మృతదేహాలను పోస్టుమార్టం కోసం జగిత్యాల జిల్లా దవాఖానకు తరలించారు.





అభినవ్(ఫైల్) రాజ్‌కుమార్(ఫైల్)

### పుట్టినరోజు నాడే మృత్యుఒడికి

పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మంగపేటకు చెందిన చుంచు రాజ్‌కుమార్ (23) తన పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం పెద్దపల్లి మండలం అప్పన్నపేటలోని చిన్నమ్మ కుటుంబసభ్యులను కలిసేందుకు వచ్చాడు. అక్కడి నుంచి తన చిన్నమ్మ కొడుకైన అనవేని అభినవ్ (17)తో కలిసి కమాన్‌పూర్ మండలం గుండారంలోని అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రంగాపూర్ వద్ద మంథని వైపు వెళ్తున్న ట్రాన్స్‌కోకు చెందిన బొలెరో వాహనం, వీరి బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్ నడుపుతున్న రాజ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, బైక్ వెనుకాల కూర్చున్న అభినవ్‌కు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు చికిత్స కోసం పెద్దపల్లికి అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి సిబ్బంది పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### బస్సు కోసం వేచి చూస్తూ మహిళ

సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామానికి చెందిన కల్వల ఈశ్వరమ్మ (45) నారాయణపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద బస్సు కోసం వేసి చూస్తున్నది. ఇదే సమయంలో కరీంనగర్ వైపు నుంచి అతి వేగంగా వస్తున్న లారీ ఓ బైక్‌ను క్రాస్ చేస్తూ అదుపు తప్పి రోడ్డు పక్కకు వెళ్లి బోల్తా కొట్టింది. ఆ సమయంలో లారీ, పక్కనే ఉన్న కరెంట్ స్తంభం మధ్యన అక్కడే ఉన్న ఈశ్వరమ్మ ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే, నారాయణపూర్‌కు చెందిన మరో మహిళ వేల్పుల సూరమ్మ తలకు, చేతులకు గాయాలు కాగా, బైక్ నడిపిన పెర్కపల్లికి చెందిన శ్రీనివాస్ గాయపడ్డారు. వారిని సుల్తానాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. ఈశ్వరమ్మ కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.